క్లుప్తంగా

రీ సర్వేను వేగవంతం చేయండి



పెదకూరపాడు: మండలంలో రీ సర్వేను వేగవంతం చేయాలని పల్నాడు జిల్లా సర్వే, భూరికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్ నాగ శేఖర్ అన్నారు. మండలంలోని జలాల్‌పురంలో మంగళవారం రీ సర్వే పనులను పరిశీలించారు. హద్దుదారుల సమక్షంలోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. రికార్డులు పరిశీలించి సర్వే నమోదును తప్పులు లేకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం సర్వే కార్యాలయంలో మండల రికార్డులను పరిశీలించి సిబ్బందికిసూచనలు చేశారు. కార్యక్రమంలో మండల సర్వే అధికారిణి మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

భూసారపరీక్షలతో పోషకాల లభ్యత గుర్తింపు

నకరికల్లు: వేసవిలో లోతుదుక్కులు చేయడం వల్ల వేయబోయే పంటలకు చీడపీడల ఉధృతి తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని రూపెన గుంట్ల గ్రామంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారపరీక్షల ఫలితాలకు అనుగుణంగా పోషకాల లభ్యతను గుర్తించి అవసరం మేరకు ఎరువులు వేయవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువులను వేసి 45 రోజుల దాటాక పూతదశలో కలియదున్నాలని అన్నారు. తద్వారా భూమికి సేంద్రియ పదార్థం అందడం ద్వారా భూమిలో చౌడు వంటి సమస్యలు తగ్గుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కె.హనుమంతరావు, వీఆర్వో ఏ.రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



క్రోసూరు: క్రోసూరు క్లస్టర్ అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి క్రోసూరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.మాధవి పాల్గొని ప్రారంభించారు. మండువేసవికి ప్రతి ఒక్కరికి తాగునీరు ఎంతో అవసరమని అన్నారు. పంచాయతీ కార్యాలయానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజలకోసం, మహిళలు, వృద్ధుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు సమైక్యంగా చలివేంద్రాన్ని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రోసూరు యూనిట్ అంగన్‌వాడీ వర్కర్లు, వీఆర్వో జిలాని, పంచాయతీ కార్యాలయ సిబ్బంది ,ఆయాలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి



సత్తెనపల్లి: కాలయాపన లేకుండా పక్కా గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. సత్తెనపల్లి మండలం గండ్లూరు గ్రామంలో పట్టణ పేదలకు నిర్మిస్తున్న జగనన్న కాలనీని మంగళవారం సందర్శించి పక్కా గృహ నిర్మాణాలను పరిశీలించారు. గండ్లూరు గ్రామంలో 1,055 జగనన్న ఇళ్లకు గాను, ఇప్పటి వరకు బేస్‌మెంట్ లేవెల కింద 640 గృహాల నిర్మాణాలు చేపట్టగా 415 గృహ నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని, లబ్ధి దారులకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా ఇళ్ల నిర్మా ణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్ వద్ద సోమ వారం అర్ధరాత్రి జరిగింది. నందిగామ గ్రామానికి చెందిన కొడిరెక్క ముసలయ్య (65), మోడీ జాన్‌లు ద్విచక్రవాహనంపై నందిగామ నుంచి సత్తెనపల్లి వస్తున్నారు. అదే సమయంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన లారీ గుంటూరు వెళ్తుంది. నందిగామ అడ్డరోడ్డు వద్ద ద్విచక్రవాహనం, లారీ ఢీకొనడంతో ముసలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. జాన్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ముసలయ్య మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని మనవడు కోడిరెక్క.వెంకట్రావు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసు లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ప్రజా భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యం

- సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి
- జాతీయ డెంగీ అవగాహన దినోత్సవం పై ర్యాలీ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: ప్రజా భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని పురపాలక సంఘం, పట్టణ మలేరియా సబ్ యూనిట్, పురపాలక సంఘ పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, మెప్మా సిబ్బందితో కలిసి మంగళవారం పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ జెండా ఊపి ఆయన ప్రారంభించారు. కమిషనర్ షమ్మి మాట్లాడుతూ దోమలు పుట్టకూడదని, పుట్టిన కొట్టకూడదని ఇది పక్కాగా క్షేత్రస్థాయిలో అమలయితే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చు అన్నారు. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం దోమల నివారణ, నిర్మూలన చర్యలు చేపట్టింద న్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఫలితంగా కొన్ని ఏళ్లుగా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు తగ్గుముఖం పట్టాయని, జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించటం ద్వారా డెంగ్యూ వ్యాధిని నివారిద్దామన్నారు. దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు పాటించడం ద్వారా దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులను నివారించవచ్చున న్నారు. డెంగీ నిర్ధారణ రక్త పరీక్షలు ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రం, ఏరియా వైద్యశాల నందు రాపిడ్ టెస్టుల ద్వారా ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సంద ర్భంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు ప్రతి ఒక్కరం దోమల సంతాన ఉత్పత్తి చేసే ప్రదేశాలను సమూలంగా నిర్మూ లిస్తామని అందుకు ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రై డే పాటిస్తామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి శాయశక్తుల కృషి చేస్తామని, ప్రజలందరి కీ దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తామని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుటలో మా వంతు పాత్ర పోషిస్తామని, వైద్య ఆరోగ్యశాఖ పురోగమనానికి పాటుపడడమే కాక ప్రజాభ్యున్నతికి ఎనలేని వైద్య ఆరోగ్య సేవలు అందించగలవారమని, త్రికరణ శుద్ధిగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జి.దర్మ, షేక్ మహబూబ్ అలీ, షేక్ సిరాజున్నిసా, హెల్త్ సూపర్వైజర్ ప్రేమ్ కుమారి, సానిటరీ ఇన్స్పెక్టర్ పార్థసారథి, శానిటరీ సెక్రటరీలు, హెల్త్ సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, మెప్మా టిఎంసి, ఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీకే సాధ్యం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



చింతపల్లికి నూతనంగా నిర్మించిన తారురోడ్డుపై ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీకే సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలో మారుమూల గ్రామాలైన చింతపల్లి, పుట్లగూడెం గ్రామాలకు నూతనంగా రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు తారురోడ్లను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలయన స్వయంగా చూశారన్నారు. అందువల్లనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు.

ఆర్అండ్ బీ రోడ్డు నుంచి పుట్లగూడెం, చింతపల్లి గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు కూడా నడవడం లేదన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఆయా గ్రామస్తులు రోడ్లకోసం గత పాలకులకు ఎంతమొర పెట్టుకున్నా వినిపించుకోలేదన్నారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు గ్రామాలకు ఒక్కొక్క రోడ్డుకు రూ.25 లక్షల చొప్పున మార్కెట్ యార్డు నిధులతో రోడ్డు మార్గం వేయించాన్నారు. ఆర్టీసి అధికారులతో సంప్రదించి ఈ రెండు గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తానన్నారు. ఇన్నాళ్లు టూవీలర్‌పై వెళ్లేందుకు కూడా అవకాశంలేక, గుంతల రోడ్డుతో ఇబ్బందులపడ్డ గ్రామస్తులు తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలగడంతో సంతోషయం వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రంజనీకృష్ణానాయక్, పుట్లగూడెం సర్పంచ్ తోట పాపారావు, తోట సత్యనారాయణ, సొసైటి మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, లీడ్ క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, చిట్టిపోతుల సత్యనారాయణ, చింతపల్లి, పుట్లగూడెం గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వైద్యాధికారి డాక్టర్ శ్యామల



అచ్చంపేటలో డెంగీవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అచ్చంపేట: గ్రామస్తులు తమ సమీప పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు పేరుకుపోకుండా చూచుకోవాలని, దోమల వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవంలో భాగంగా అచ్చంపేటలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్ ఆదివారం డెంగీవ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దోమల వల్ల డెంగీ, మలేరియ, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్స్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇంటి ముందు మురుగుకాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని, మురుగు ఉన్నచోట బ్లీచింగ్, ఫినాయిల్ చల్లుకోవాలని సూచించారు. వ్యాధులు వచ్చిన తరువాత ఇబ్బందులు పడేకన్నా వ్యాధులు రాకుండా చూచుకోవడం మంచిదన్నారు. డెంగీవ్యాధిని సమూలంగా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. వృథానీటి నిర్మూలనే దోమల నివారణకు మార్గం, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ వంటి నినాదాలు చేశారు. ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్స్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి

ఏఓ సుగుణాబేగం



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుగుణాబేగం

అచ్చంపేట: రైతులు వేసవిలో పంట భూములను భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణమైన ఎరువులను వాడవలసి ఉంటుందని వ్యవసాయాధికారి షేక్ సుగుణాబేగం చెప్పారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చిగురుపాడు, కోగంటివారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన రైతు అవగాహన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. రైతులు వేసవి దుక్కులు దున్నుకుని భూములను సేద్యానికి అనుకూలంగా ఉంచుకోవాలని చెప్పారు. సాధ్యమైనంతవరకు సేంద్రయ ఎరువులను వాడాలని, పంట మార్పిడి విధానాన్ని పాటించాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసేటపుడు లైసెన్స్‌లున్న డీలర్ల వద్దమాత్రమే కొనుగోలు చేయాలని, బిల్లులు తీసుకుని పంటకాలము పూర్తయ్యేంతవరకు భద్రపరచుకోవాలని చెప్పారు. భూములను ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రతి రైతుభరోసా కేంద్రంలో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జీలుగ వంటి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. పీయం వికాస్, యంత్రసేవా పథకం, డ్రోన్స్ వినియోగం తదితర విషయాలను వివరించారు. పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా వాక్సిన్ వేయించుకోవాలన్నారు. డివార్మింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, పశుసంవర్థక శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం



సత్తెనపల్లి: మండలంలోని ఫణిదం గ్రామంలో రూ.1.20 లక్షలు విలువ చేసే వరిగడ్డి వామి మంగళవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన బత్తుల ఆంజనేయులు గ్రాం నుంచి లక్ష్మీపురం వెళ్లే రోడ్‌లో ఇంటి ముంగిట ఏర్పాటు చేసుకున్న ఐదు ఎకరాల వరిగడ్డి వామి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. రూ.1.20 లక్షల విలువ చేసే వరిగడ్డి వామి దగ్ధం కావడంతో రైతు ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు.

లింగనిర్ధారణ చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి ఆర్డీఓ జీఎల్ఎన్ రాజకుమారి



మాట్లాడుతున్న ఆర్డీవో రాజకుమారి

సత్తెనపల్లి: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చట్టం –1994 పరిధిని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఆర్డీఓ బీ.ఎల్.యస్.రాజకుమారి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయములో పి.సి.పి.ఎన్.డి.టి యాక్ట్ పై ఉప జిల్లా సాయి సత్తెనపల్లి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అధారిటీ, ఉప జిల్లాస్థాయి స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆర్డీఓ రాజకుమారి మాట్లా డుతూ స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, డేకాయ్ ఆపరేషన్లు నిర్వహించాల న్నారు. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే 102, 104 నంబర్లకు ఫోను చేసి తెలియజేయ వచ్చునని వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఇంమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి. గీతాంజలి, డివిజన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్.నాగ పద్మజ, కమిటీ సభ్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ ప్రేమ, డాక్టర్ అనూష, జిల్లా డిప్యూటీ డెమో సాంబశివరావు, హెల్త్ ఎడ్యుకేటర్ షేక్ ఖాజావలి,హెచ్.ఈ.ఓ. పి.వెంకట రావు, యస్.జి.ఓ సంస్థల నుండి కంబాల వెంకటేశ్వర రావు, పుట్టి సాంబశివరావు, బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌బీఓ సరికొండ గోవిందరాజు

నకరికల్లు: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని గుండ్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సరికొండ గోవిందరాజు పిలుపునిచ్చారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్.నీలిమాదేవి ఆధ్వర్యంలో మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించడానికి నా రోజువారీ జీవితంలో సాధ్యమయ్యే అన్నిమార్పులు చేస్తానని, పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యత గురించి నాకుటుంబం, స్నేహితులు , ఇతరులను ప్రేరేపించడానికి నేను కట్టుబడి ఉన్నాను అని ప్రతిజ్ఞ చేసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం మానివేయాలన్నారు. అడవులకు నిప్పు అంటించరాదని సూచించారు. అటవీ జంతువులకు, పక్షులకు హాని కలిగించరాదని సూచించారు. ఇంధన పొదుపు పాటించాలన్నారు. కార్యక్రమంలో డి.మౌలాలి, మాభుసుభాని, మాబు, యామగిరి అలీ, జాని, సయ్యద్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు



పెదమక్కెన అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సూచనలు చేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీకవిత



కొమెరపూడిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సాయి తేజారెడ్డి

సత్తెనపల్లి: మండలంలోని పెద్దమక్కెన గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు అందించారు. ఫణీదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు. శ్రీలక్ష్మీ కవిత రోగులను పరీక్షించారు. మొత్తం 284 మంది రోగులను పరీక్షించారు. వీరిలో జనరల్ ఓపి 35 మంది, హైపర్ టెన్షన్ 136 మంది, డయాబెటిస్ 40 మంది, గర్భిణులు 10 మంది, బాలింతలు ఇద్దరు, చిన్నారులు నలుగురికి వైద్య సేవలు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పలు ఆరోగ్య విషయాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్(ఎఫ్) జే సంపూర్ణ దేవి, ఎమ్ఎల్‌హెచ్‌పీ,సీహెచ్ఓ బి.రత్నప్రభ, ఎంపీహెచ్ఎ(ఎఫ్) సిహెచ్ భాగ్యలక్ష్మి, ఎంపీహెచ్ఎ(ఎమ్) షేక్ సుభాని, ఆశా కార్యకర్తలు పి.పద్మ, ఎం. మరియమ్మ, కె.సంపూర్ణరాణి, తదితరులు ఉన్నారు.

కొమెరపూడి గ్రామంలో...

మండలంలోని కొమెరపూడి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషీయన్‌లో భాగంగా మంగళవారం వైద్య సేవలు అందించారు. డాక్టర్ సాయి తేజ రెడ్డి రోగులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 341 మంది రోగులను పరీక్షించారు. వీరిలో జనరల్ ఓపి 31 మంది, హైపర్ టెన్షన్ 161 మంది, డయాబెటిస్ 100 మంది, గర్భిణులు 11మంది, బాలింతలు 8 మంది, చిన్నారులు ఐదుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి సూచన చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్ హెచ్‌పీ,సీహెచ్ఓ డి.వైశాలి, ఎంపీహెచ్ఏ(ఎఫ్) సిహెచ్.శారదా దేవి, ఎంపీహెచ్ఎ (ఎమ్) పి.నాగేశ్వరరావు, ఆశ కార్యకర్తలు రుక్మిణి, ఎలిశమ్మ, రజియా, రమ్య, సామ్రాజ్యం ఉన్నారు.

టీబీ రోగులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ గీతాంజలి



టీబీ రోగులకు ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గీతాంజలి, డాక్టర్ నాగపద్మజా, స్టాలిన్

సత్తెనపల్లి: టీబీ రోగులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని సత్తెనపల్లి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో టీబీ ముక్తభారత్ అభియాన్ లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ టీబీ రోగులు మందులు వాడుతున్న సమయంలో బలమైన ఆహారం తీసుకోవాలని కనుక పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రత్యేక శ్రద్ధతో ఫుడ్ బాస్కెట్స్‌ను రోగులకు అందించడం జరుగు తుంద న్నారు. టీబీ రోగులు ప్రభుత్వ అందిస్తున్న పథకాలను పొందాలన్నారు. అనంతరం ఫుడ్ బాస్కెట్లను టీబీ రోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఓటీసీ డాక్టర్ డి.నాగపద్మజా, ఎస్‌టీఎస్ ఎన్.స్టాలిన్, పీపీ యూనిట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

యడ్లపాడు:పేదకుటుంబానికి జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. యడ్లపాడు ఎస్సీ కాలనీ(పైపల్లె)కు చెందిన కారెంశెట్టి రాజారత్నం ఇటీవల మృతి చెందాడు. ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా వారి కుటుంబాన్ని మంగళవారం కలిసి పరామర్శించి. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

జాతీయ డెంగీ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి, సిబ్బంది



జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సి సిబ్బంది

ముప్పాళ్ళ: దోమకాటు చాలా ప్రమాదకరమని, ఏడిస్ దోమల వల్ల డెంగీ వ్యాధి వ్యాపిస్తోందని పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమాదేవి చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యురాలు పీ.రమాదేవి డెంగీ వ్యాధి లక్షణాలను వివరించారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేనితలనొప్పి, కండరాలు, కీళ్ళ నొప్పులు ఉంటాయన్నారు. ఆకలి మందగించడం, చర్మంపై దద్దుర్లు వస్తాయన్నారు. దోమలు పెరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ దోమ మంచినీళ్ళలో పెరుగుతుందని, ముఖ్యంగా కూలర్, ఏసీ ట్రే లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పాత సామానులు, పాత టైర్లు, నీటి గుంటలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. ర్యాలీలో సీహెచ్ఓ ఆంజనేయులు, సూపర్‌వైజర్లు పీటర్‌డానియేన్, నాగమల్లేశ్వరరావు, జోస్పిన్‌రాణి, భవానికుమారి, సీతారామిరెడ్డి, సీహెచ్ఓలు మనుతేజ, పావని, కమల, ఫార్మాసిస్టు రాజ్యలక్ష్మి, ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరం

నకరికల్లు: ప్రాణాంతకమైన డెంగీ వ్యాధిన బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సి వైద్యాధికారి వి.శ్రీనునాయక్ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సి ఆధ్వర్యంలో నకరికల్లు, చల్లగుండ్ల అడ్డరోడ్డులో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించకుంటే దోమలు వ్యాప్తి చెంది తద్వారా డెంగీ దోమలు ఉత్పత్తి అయ్యే ప్రమాదం ఉందన్నారు. వినియోగంలో లేని నీటితొట్టిలు, పాతటైర్లలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగుకాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.నాగమణి, సర్పంచ్ కె.సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ కె.మల్లయ్య, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

18న పాత వస్తువులకు బహిరంగ వేలం

నాదెండ్ల: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సామగ్రికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కె.ప్రియాంక తెలిపారు. పాత ఇనుప వస్తువులు, తలుపులు, కిటికీలు, మరికొన్ని వస్తువులు వేలానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రి పనిచేసే సమయాల్లో సంప్రదించాలని కోరారు. ఈ నెల 18న బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు సీనియర్ సహాయకులు హనమంతనాయక్‌ను 9989176074 నంబ

కౌలు రైతు గుర్తింపు కార్డు కలిగి ఉండాలి

క్రోసూరు: మండలంలోని బయ్యవరం, గుడిపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల వద్ద రైతు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్ మాట్లాడుతూ కౌలుకు సాగు చేసే ప్రతి రైతు కౌలు కార్డు కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కౌలు గుర్తింపు కార్డు ఉన్న రైతుకు కూడా వైఎస్సార్ రైతుభరోసా ఆర్థిక సహాయం రూ.13,500, ఈ క్రాప్ నమోదు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కొనుగోలు, ఉచిత పంటబీమా, మద్దతు ధర , పంట రుణాలు, పథకాలు వర్తిస్తాయన్నారు. భూయజమాని పట్టాపుస్తకం, ఆధార్‌కార్డు, కౌలు దారుడు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కౌలు గుర్తింపు దరఖాస్తు పూర్తిచేసుకుని మీ గ్రామ వీఆర్వోను సంప్రదించి కౌలు గుర్తింపుకార్డు పొందవచ్చునన్నారు. అదేవిధంగా వైఎస్సార్ రైతుభరోసా అర్హత ఉన్న ప్రతి రైతు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉచిత పంట బీమా గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సబ్సిడీ విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో రైతులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.